


షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152




Best for Readers

సంపుటి : 2 సంచిక : 332 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 01 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 332 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 01 December 2025 PAGES : 8 PRICE : 3/-


## 'పేదల సేవలో' కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి.. టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు సూచన



**నిరంతరం ప్రజల్లో ఉండాలని హితవు**

**ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న టీడీపీ అధినేత**

**పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలన్న చంద్రబాబు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)

రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వారే నాయకులుగా రాణిస్తారని -మిగతా 2లో

## రాష్ట్రాభివృద్ధికి మూడు జోన్లు సమగ్ర వికాసానికి ప్రాంతాల వారీగా ఏర్పాటు!



**విశాఖ రీజియన్‌లో 9, అమరావతిలో 8, రాయలసీమలో 9 జిల్లాలు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)

రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా మూడు ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ కేంద్రంగా 9 జిల్లాలతో విశాఖ ఎకనమిక్ రీజియన్, అమరావతి కేంద్రంగా 8 జిల్లాలతో అమరావతి ఎకనమిక్ రీజియన్, రాయలసీమ 9 జిల్లాలతో తిరుపతి కేంద్రంగా రాయలసీమ ఎకనమిక్ రీజియన్ ఏర్పాటు కానున్నాయి. బోర్డుల ఏర్పాటు, -మిగతా 2లో

## మూడు జిల్లాలకు రెడ్ ఎలర్ట్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)

నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుపాను కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు వాతావరణ విభాగం రెడ్ ఎలర్ట్ జారీ చేసింది. శనివారం మధ్యాహ్నానికి కరైకల్‌కు ఆగ్నేయంగా 120 కిలోమీటర్లు, పుదుచ్చేరికి దక్షిణ-ఆగ్నేయంగా 220, చెన్నైకి దక్షిణంగా 330 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం ఉదయానికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు చేరువగా రానుందని ఐఎండీ పేర్కొంది. తుపాను ఉత్తర-వాయవ్య దిశగా కదిలే క్రమంలో ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు-పుదుచ్చేరి తీరానికి 60 కి.మీ., సాయంత్రానికి 25 కి.మీ. సమీపానికి రానుంది. ఇది తీరం దాటే -మిగతా 2లో

# పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోంది


(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 30)

పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉందన్నారు. మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి వివిధ రంగాల్లో యువత అద్భుతమైన



ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోందని.. మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిందని అన్నారు.

స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కలను సాకారం చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని వ్యాఖ్యానించారు. కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలోని ఓ వీడియో తన దృష్టిని ఆకర్షించిందన్నారు. అందులో అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా రూపొందించిన చోట డ్రోన్లను ఎగరవేయడానికి మన యువత ప్రయత్నించారన్నారు. వాటికి జీపీఎస్ మద్దతు లేకపోవడం వల్ల డ్రోన్లు నేలకూలుతున్నప్పటికీ.. పుణెకు చెందిన విద్యార్థుల బృందం పట్టుదలతో పలుమార్లు యత్నించి డ్రోన్లు కొంత సమయం ఎగిరేలా చేసినట్లు వెల్లడించారు. యువతలో ఉన్న ఇటువంటి గొప్ప సంకల్ప బలమే దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు తోడ్పడుతుందన్నారు.




## 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)

రాష్ట్రంలో గోదావరి పుష్కరాలను 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు నిర్వహించాలని ఆగమ, వైదిక పండితులు సూచించారు. ఈ మేరకు తేదీలతో కూడిన నివేదికను దేవాదాయ శాఖ ప్రభుత్వానికి పంపింది. గోదావరి పుష్కరాలను ఏయే తేదీల్లో నిర్వహించాలనే దానిపై ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాలకు చెందిన ఆగమ, వైదిక పండితులు, తితిదే ఆస్థాన సిద్ధాంతితో కలిపి మొత్తం 16 మంది పాల్గొన్న సమావేశంలో పుష్కరాల తేదీలపై ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ మేరకు నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. దీనిపై ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకొని, నోటిఫికేషన్ జారీచేయాల్సి ఉంది. గత పుష్కరాలు 2015లో జులై 14 నుంచి 25 వరకు జరిగాయి. -మిగతా 2లో

## ఏపీలో తెదేపా రాష్ట్ర, జిల్లా కమిటీల జాబితా సిద్ధం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)

తెదేపా రాష్ట్ర, జిల్లా కమిటీల జాబితా సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సామాజిక సమీకరణాలకు అనుగుణంగా డిసెంబర్ 16 నాటికి తుది జాబితా సిద్ధం చేస్తామన్నారు. కమిటీల తుది జాబితాపై డిసెంబర్ 17న మంత్రి లోకేశ్ సమీక్షిస్తారని, అనంతరం ప్రకటిస్తామని తెలిపారు. పోలవరం, శింగనమల, జీడీ నెల్లూరు నియోజకవర్గాల్లోని రెండేసి మండలాలలో కమిటీలపై అభ్యంతరాలున్నాయని, ఆయా మండలాల్లో మళ్లీ ఐవీఆర్ఎస్ సర్వే చేస్తామన్నారు.

మరోవైపు రేపటి నుంచి తెదేపా నాయకులకు ఎన్టీఆర్ భవన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. సోమ, మంగళవారాల్లో 100 మంది తెదేపా మండలాధ్యక్షులకు శిక్షణ ఇవ్వనున్నారు. పార్టీ నేతలతో తెదేపా సీనియర్ నేతలు మాట్లాడనున్నారు. ముగింపు కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు.

## దిత్వా తుపాను.. సాయం కోసం చేసే కాల్స్‌కు వెంటనే స్పందించాలి: హోంమంత్రి అనిత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)

దిత్వా తుపానుపై సచివాలయంలో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తుపాను



నేపథ్యంలో ఇవాళ, రేపు అధికారులు మరింత అలర్ట్‌గా ఉండాలని హోం మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.సహాయం కోసం కంట్రోల్ రూమ్‌కు వచ్చే కాల్స్‌కు వెంటనే -మిగతా 2లో

## ప్రపంచ తెలుగు మహా సభలు.. ఒడిశా గవర్నర్ హరిబాబుకు ఆహ్వానం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 30)




ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 3 నుంచి 5 వరకు గుంటూరులో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొనాలని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందజేశారు. భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఆయన్ను కలిశారు. అమరావతి శ్రీ సత్య సాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణం ( హైవే) లో నందమూరి తారకరామారావు వేదికపై జనవరి 3న సాయంత్రం నిర్వహించే "పూర్ణ కుంభ పురస్కార సభ"కు ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు. తమ ఆహ్వానానికి ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని -మిగతా 2లో

## 10 మంది ట్రంప్‌లు వచ్చినా ఏం చేయలేరు ఆఫ్ఘన్ ఇమిగ్రేషన్ బ్యాన్ పై అమెరికా మాజీ సైనికుడు

**వాషింగ్టన్ కాల్పుల తర్వాత ఆఫ్ఘన్లపై ట్రంప్ కఠిన చర్యలు**

**ఆఫ్ఘన్లకు గ్రీన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేత**

**ఒకరి తప్పుకు దేశాన్ని నిందించడం అన్యాయమన్న మాజీ సైనికుడు**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 30)

వాషింగ్టన్ డీసీలో ఆఫ్ఘన్ మూలాలున్న వ్యక్తి జరిపిన కాల్పుల ఘటన అమెరికాలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఆఫ్ఘన్ వలసదారులపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. అయితే, ఒక వ్యక్తి చేసిన తప్పుకు యావత్ ఆఫ్ఘన్ సమాజాన్ని బలిపశువును చేయడం అన్యాయమని అమెరికా మాజీ సైనికుడు అహ్మద్ షా మోహిబి తీవ్రంగా వ్యతిరేకించారు. కాల్పుల ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ స్పందిస్తూ.. ఆఫ్ఘన్ జాతీయులకు గ్రీన్ కార్డుల జారీ ప్రక్రియను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్‌ను ఒక "నరక కూపం"గా అభివర్ణించారు. దీంతో పాటు ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్, ఇరాన్, వెనెజువెలా సహా 19 దేశాల నుంచి వచ్చిన వలసదారుల వివరాలపై -మిగతా 2లో

## ఏపీలోనూ 'ఎస్ఐఆర్' చేపట్టాలి: ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, నవంబర్ 30)

కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను స్వాగతిస్తున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఏపీలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ -మిగతా 2లో

# మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ మాగుంట







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)

డిసెంబర్ 1 తేదీన స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని పీవీఆర్ గ్రౌండ్స్‌లో కార్యక్రమ ఏర్పాట్లను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి, యువ నాయకులు మాగుంట నిఖిల్‌రెడ్డి పరిశీలించారు. మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మాగుంట అభిమానులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు టౌన్ డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు, నగర కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

# జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆకట్టుకుంటున్న గ్రంథాలయం

### డిప్యూటీ డిఈఓ ఎం శ్రీనివాసులు

### ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మిని అభినందించిన డిప్యూటీ డిఈఓ





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 30)

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్మించిన గ్రంథాలయం ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టు ఉంటుందని డిప్యూటీ డిఇఓ ఎం శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయులు కలవ విజయలక్ష్మిని అభినందించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వివిధ పుస్తకాలను పరిశీలించారు. ఈసందర్భంగా డిప్యూటీ డిఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పీఎంశ్రీలో పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. డిసెంబర్ 5న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డే ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ వీరంరెడ్డి నాగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కలవ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మి, నాగమణి, సాయిలక్ష్మి, యాలం శ్రీను, యశోద, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ‘పేదల సేవలో’ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి.. టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు సూచన

ఆయన చెప్పారు. ఈమేరకు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలని నేతలకు తెలిపారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో నాయకుల భాగస్వామ్యం ప్రస్తుతం 25 వేలకు చేరిందని చంద్రబాబు వెల్లడించారు.

# 10 మంది ట్రంప్‌లు వచ్చినా ఏం చేయలేరు

## ఆఫ్ఘన్ ఇమిగ్రేషన్ బ్యాన్ పై అమెరికా మాజీ సైనికుడు

విస్తృత సమీక్షకు ఆదేశాలు జారీ చేశారు.ట్రంప్ చర్యలను మోహిబి తప్పుబట్టారు. “ఒక వ్యక్తి తుపాకీతో దాడి చేసినంత మాత్రాన ఆఫ్ఘన్ ప్రజలంతా ఉగ్రవాదులు కాదు. అందరినీ శిక్షించడం సరికాదు” అని ఆయన అన్నారు. 2021లో అమెరికా సేనల ఉపసంహరణ సమయంలో నెలకొన్న గందరగోళ పరిస్థితులే ప్రస్తుత సమస్యలకు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా వలసల విధానం పూర్తిగా విఫలమైందని... పది మంది ట్రంప్‌లు వచ్చినా ఈ సమస్యను పరిష్కరించలేరని ఆయన వ్యాఖ్యానించారు.ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కాల్పులకు పాల్పడిన రహ్మానుల్లా లకన్‌వాల్.. స్పెషల్ ఇమ్మిగ్రెంట్ వీసా (%ఐజ%) ప్రోగ్రామ్ కింద అమెరికాకు రాలేదు. తాలిబన్లు అధికారం చేపట్టాక, నాటి అధ్యక్షుడు జో బైడెన్ ప్రారంభించిన ‘ఆపరేషన్ అలైస్ వెల్‌కమ్’ కార్యక్రమం ద్వారా అమెరికా చేరుకున్నాడు. గతంలో సీఐఏతో కూడా పనిచేసిన లకన్‌వాల్, 2024లో శరణార్థి హోదా కోసం దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది ట్రంప్ పరిపాలనలోనే ఆమోదం లభించడం గమనార్హం.

ఈ ఘటనను సాకుగా చూపి ప్రభుత్వం చాలాకాలంగా అమలు చేయాలనుకుంటున్న విధానాలను ముందుకు తెస్తోందని ‘ఆఫ్ఘన్‌ఇవాక్’ అధ్యక్షుడు షాన్ వాన్‌డైవర్ ఆరోపించారు. అమెరికా వలసల విధానంలోని వైఫల్యం ఏ ఒక్క అధ్యక్షుడిదో కాదని, ఇది దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యవస్థాగత లోపమని విశ్లేషకులు అంటున్నారు.

# రాష్ట్రాభివృద్ధికి మూడు జోన్లు

## సమగ్ర వికాసానికి ప్రాంతాల వారీగా ఏర్పాటు!

విధి విధానాలకు సంబంధించిన ఉత్తర్వులు సోమ, మంగళవారాల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రతి జోన్‌లో స్టీరింగ్, ఎగ్జిక్యూటివ్, ఇంప్లిమెంటేషన్ కమిటీలు ఉంటాయి. సీనియర్ ఐఏఎస్ అధికారి సీఈఓగా వ్యవహరిస్తారు. విశాఖ రీజియన్‌కు సీఈఓగా యువరాజ్ వ్యవహరిస్తున్నారు. అమరావతి రీజియన్‌కు ముకేశ్‌కుమార్ మీనా, రాయలసీమ రీజియన్‌కు కృష్ణబాబు సీఈఓగా నియమితులయ్యే అవకాశం ఉంది.

**ప్రాంతాల వారీగా ప్రణాళికలు**

మూడు ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా క్లస్టర్ వారీగా విజన్ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, నగరపాలక సంస్థల అధికారుల సమన్వయంతో వీటిని అమలు చేస్తారు.

# మూడు జిల్లాలకు రెడ్ ఎలర్ట్

అవకాశం లేదని, తీరం వెంబడి కదులుతూ సముద్రంలోనే బలహీనపడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు తుపాను తీవ్రత కొనసాగి, తర్వాత వాయుగుండంగా బలహీనపడుతుందని అంచనా వేస్తున్నారు.

**పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు**

తుపాను ప్రభావంతో రాబోయే మూడు రోజులూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదివారం.. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. సోమవారం.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మంగళవారం.. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడొచ్చని, తీరం వెంబడి గరిష్ఠంగా గంటకు 80 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయొచ్చని పేర్కొంది.

**పోర్టులకు హెచ్చరికలు**

సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో సోమవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు. కృష్ణపట్నం పోర్టుకు మూడో నంబరు, విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులకు రెండో నంబరు హెచ్చరికలను కొనసాగిస్తున్నారు.

# 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

**అన్ని శాఖలతో సమన్వయం**

రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో గోదావరి ప్రవహిస్తుంది. వివిధ రాష్ట్రాల నుంచీ భారీ సంఖ్యలో భక్తులు పుష్కర స్నానం ఆచరించేందుకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసేలా ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. మంత్రుల కమిటీని, వివిధ శాఖల కార్యదర్శులతో కమిటీని ఏర్పాటు చేసింది.

# ఏపీలోనూ ‘ఎస్ఐఆర్’ చేపట్టాలి: ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నేతృత్వంలో అఖిలపక్ష భేటీ జరిగింది. సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షపార్టీలకు కేంద్రం విజ్ఞప్తి చేసింది. అఖిలపక్ష భేటీ అనంతరం శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల పంపిణీలో గందరగోళం వల్ల ఏపీ నష్టపోతోందని, దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని కోరినట్లు చెప్పారు.

# దిత్వా తుపాను.. సాయం కోసం చేసే కాల్స్‌కు వెంటనే స్పందించాలి: హోంమంత్రి అనిత

స్పందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులను నియమించాలని దిశానిర్దేశం చేశారు. ఈదురు గాలుల ధాటికి విరిగిన కొమ్మలు, హోర్డింగ్స్ వంటివి వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరణ చేయాలని తెలిపారు. అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్లు మంత్రికి వివరించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించడానికి కూడా ఏర్పాట్లు చేశామన్నారు.

# ప్రపంచ తెలుగు మహా సభలు.. ఒడిశా గవర్నర్ హరిబాబుకు ఆహ్వానం

గజల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ‘తెలుగు మాట ప్రతి నోట’ అనే మహా సంకల్పంతో ప్రజలందరూ పయనించాల్సిన అవసరం ఉందని గవర్నర్ హరిబాబు అభిప్రాయపడ్డారన్నారు.

# ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కీలక ప్రాంతాల్లో

## ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన ప్రకాశం పోలీసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)

ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిసర ప్రాంతాలు, వెంకటేశ్వర స్వామి గుడి వద్ద మద్దిపాడు ఎస్ఐ వెంకట సూర్య, ఆర్ఎస్ఐ తిరుపతిస్వామి, డాగ్ స్క్వాడ్ (పేలుడు పదార్థాలు గుర్తించి మాగ్గీ జగిలాం), బాంబ్ డిస్పోజల్ టీం సభ్యులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ చుట్టుపక్కల ఉన్న అన్ని ప్రవేశ మార్గాలు, డ్యామ్ పైభాగం, ఉద్యానవనం ప్రదేశాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించే ప్రత్యేక జగిలాంతో సహా బాంబ్ డిస్పోజల్ టీమ్ ప్రతి మూలను పరిశీలించారు. ప్రజలు తరచూ సందర్శించే ప్రదేశమై ఉండటంతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. అలాగే, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో వచ్చే వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, దేవస్థాన పరిసరాల్లోనూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆలయ చుట్టుపక్కల ఉన్న ఏరియాలు వరకు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని లేదా డయల్ 112 కాల్ చేయాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు, నేర నియంత్రణ చర్యలను మరింత పటిష్టం చేసేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ప్రజల భద్రతే తమ ప్రధాన ప్రాధాన్యమన్నారు.









# ప్రధానమంత్రి నరేంద్ర మోడి మన్ కీ బాత్ వీక్షించిన సూర్య కల్యాణ్ చక్రవర్తి

## బీజేపీ నాయకులతో కలిసి వీక్షణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)

ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం తన 128వ ఎడిషన్ మన్-కీ-బాత్ రేడియో కార్యక్రమంలో జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసెల్స్ కో - కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వీక్షించారు. ఒంగోలు 39వ డివిజన్ 21వ బూత్, మంగమూరురోడ్డు రోడ్డులోని కందుల నారాయణ నాయుడు నగర్ లో కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రధాని మోడీ యువత గురించి మాట్లాడారని, యువత దేశానికి వెన్నెముక అని గుర్తు చేసుకున్నారని చెప్పారు. కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్ క్రీడా రంగంలో తన సత్తా ప్రపంచవ్యాప్తం చేస్తోందని అన్నారని, మోడీ నాయకత్వంలో భారత్ మరింత ముందుకు వెళ్తోందనేందుకు ఇది నిదర్శనం అని కల్యాణ్ చక్రవర్తి అన్నారు. మన్ కీ బాత్ లో ప్రధాని మోడీ అనేక మంచి విషయాలను ప్రస్తావిస్తున్నారని, ప్రతి నెల అందరూ ఈ కార్యక్రమాన్ని వినాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు శివాజీ యాదవ్, దండు శ్రీనివాసరావు, 4వ మండల కన్వీనర్ కుప్పూరు సతీష్, మండల అధ్యక్షులు వంశీకృష్ణ, భాష, బ్రహ్మారెడ్డి, నాగేశ్వరరెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటరావు, యాసిన్, రాధాకృష్ణ, ఆర్ఎంపీ ఏడుకొండలు, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

ప్రకాశం


# బీ.. అలర్ట్ !

## జిల్లా పై నేడు, రేపు దిత్వా ప్రభావం




**ఎలాంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం**

**కలెక్టర్ రాజాబాబు వెల్లడి**

**ప్రజలు సహకరించాలి**

**ఎలాంటి ప్రయాణాలు పెట్టుకోవద్దని పిలుపు**

**జిల్లా కేంద్రంలో నేడు 'మీకోసం' రద్దు**

**వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచన**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**

దిత్వా తుఫాను ప్రభావంతో జిల్లాలో సోమ, మంగళవారాలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తముగా ఉన్నట్లు కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. ఎలాంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు (తరువాయి 4లో...)

# దిత్వా తుఫాను నష్టాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలి

### రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారది

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 30)**

దిత్వా తుపాను నష్టాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగమంతా సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దిత్వా తుపాను హెచ్చరికతో ముందస్తు జాగ్రత్త చర్యలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆదివారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. గత తుపాను అనుభవాలతో మరింత సమర్థంగా, అధికారులు స్ఫూర్తితో పని చేయాలని మంత్రి సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తం కావాలన్నారు. జిల్లాలో అద్దంకి, చిన్నగంజాం మండలాలకు హై అలర్ట్ ఉందన్నారు.గత (తరువాయి 4లో...)




# నేడు పీజీఆర్ఎస్ రద్దు

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**

దిత్వా తుఫాన్ దృష్ట్యా డిశంబర్ 1వ తేదీ సోమవారం ఒంగోలు కలెక్టరేట్లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజిఆర్ఎస్) కార్యక్రమం నిమిత్తం ఒంగోలుకు రావద్దని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య వైద్య చికిత్స పొందుతూ మృతి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 30)**

మార్కాపురం మండలం కోల భీమునిపాడు గ్రామంలో రైతు మందా సత్యనారాయణరెడ్డి (45) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 26న ఆయన పురుగుమందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కాసేపటి క్రితం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయనకు సుమారుగా రూ.20 లక్షల మేర అప్పులున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలి

**తహసిల్దార్ ఆర్ బ్రహ్మయ్య**



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, నవంబర్ 30)

రాష్ట్ర ప్రభుత్వం దిత్వ తుఫాను హెచ్చరిక మేరకు చీమకుర్తి మండలంలో ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు గ్రామాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని, గ్రామాలలో వాగులు కాలువలు, కల్వర్టులను నిరంతర పర్యవేక్షణ చేయాలని తహసిల్దార్ బ్రహ్మయ్య ఆదేశించారు. గతంలో మొంథా తుఫాను సమయంలో విధులు నిర్వహించిన విధంగా చెరువులు, వాగుల వద్దకు వెళ్లి పరిశీలించి ఎప్పటికప్పుడు పరిస్థితులను అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామాలలో తుఫాను ప్రభావం తగ్గేంత వరకు కోతకు వచ్చిన వరి, ఇతర పంటలు కోతలు జరగకుండా చూడాలని, గ్రామాలలో పడిపోయే స్థితిలో ఉన్న భవనాలలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత భవనాల్లోకి చేర్చే చర్యలు తీసుకోవాలని గ్రామస్థాయి అధికారులకు తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఎవరైనా అధికారులు పాటించని పక్షంలో ప్రభుత్వం తీసుకొనే చర్యలకు బాధ్యులవుతారని తెలియజేశారు.

## మండువవారిపాలెంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)

మండలంలోని మండువవారిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ప్రారంభించిన గ్రామ సచివాలయం భవనం పక్కనే వేప చెట్టు కింద కూర్చొని ప్రజా దర్బార్ నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహి ంచడం తో గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను చెప్పుకున్నారు. కొంతమంది సామాజిక సమస్యలను దామచర్ల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్తుల నుండి అర్జీలను స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 30)

దిత్వా తుఫాన్ కారణంగా అధికంగా వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్న తరుణంలో కనిగిరి పట్టణంలో ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టామని మునిసిపల్ కమీషనర్ పి కృష్ణ మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాతావరణశాఖ వారి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశానుసారం కనిగిరి మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనలను అనుసరించి ప్రత్యేక సిబ్బందిని విధులలో కేటాయించామని పట్టణ ప్రజలు ఎటువంటి అత్యవసర పరిస్థితులలోనైన పురపాలక సంఘ కార్యాలయము నందు మరియు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వవలసినదిగా తెలిపారు. దిత్వా తుఫాన్ ముందస్తు నివారణ చర్యలు, అత్యవసర సహాయక చర్యలు చేపట్టుటకు మునిసిపల్ సిబ్బంది నెంబర్లను సంప్రదించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ 9700727807, హెల్త్ అసిస్టెంట్ 7893114370 పట్టణ ప్రజలు అత్యవసర సహాయక చర్యల కొరకు వినియోగించుకోవాలన్నారు. కనిగిరి పురప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప గృహాలను విడిచి బయటకు రాకూడదని కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బీ.. అలర్ట్ !

## జిల్లా పై నేడు, రేపు దిత్వా ప్రభావం

సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలను ఆదివారం ప్రకాశం భవనంలోని దిత్వా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తుఫాను వివరాలు వివరించారు. జిల్లాలోని 14 మండలాల పై తుఫాను ప్రభావం ఉంటుందన్నారు. కనిగిరి, కొండపి, కొత్తపట్నం, మర్రిపూడి, మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు, పామూరు, పీసీపల్లి, పొన్నలూరు, సంతనూతలపాడు, టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాలలో తీవ్రమైన గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మొంథా తుఫాను నేపథ్యంలో ఎదురైన అనుభవాలను పరిగణలోకి తీసుకుని ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అన్ని ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ, నల్ల కాలువలో ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగానికి సహకరించేలా 30 మందితో కూడిన జాతీయ విపత్తుల నిర్వహణ బృందం ( ఎన్.డి.ఆర్.ఎఫ్) కూడా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ చెప్పారు. చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు ఆయన పిలుపునిచ్చారు. వరి కోతలను ఐదు రోజులపాటు వాయిదా వేసుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. తుఫాను దృష్ట్యా జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే "మీకోసం" కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో డిఆర్ఓ బి చిన ఓబులేసు, ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండర్ దిల్బాగ్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## జనసేన కార్యకర్తకు సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, నవంబర్ 30)

మార్కాపురం పట్టణంలోని శివాజీ నగర్ నందు జనసేన పార్టీ కార్యకర్త జక్కి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు సిఎం సహాయనిధి చెక్కును జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆదివారం వారి నివాసానికి వెళ్లి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు వీరిశెట్టి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు విజయరావు, నరసింహారావు, పిచ్చయ్య, శ్రీను, ఎలిశెట్టి భరత్, తదితరులు పాల్గొన్నారు.

# దిత్వా తుఫాను నష్టాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలి

తుపానులో జిల్లా యంత్రాంగమంతా కలెక్టర్ నాయకత్వంతో సమష్టిగా పని చేశారని అభినందించారు. అదే మాదిరిగా రానున్న భారీ వర్షాలను సమర్థంగా ఎదుర్కోవడానికి సంసిద్ధం కావాలన్నారు. జిల్లాలో తీర ప్రాంతం అధికంగా ఉన్నందున ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి, బోట్లు అన్ని తీరానికి వచ్చాయా లేదా పునఃపరిశీలన చేయాలన్నారు. మత్స్యకారులను సముద్రంలోనికి వెళ్ళనీయరాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా సూక్ష్మ దృష్టితో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సీఎం, సిఎస్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జనజీవనానికి ఇబ్బందులు లేకుండా సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఏదైనా సమస్య వస్తే తక్షణమే స్పందించాలన్నారు. సాగునీటి కాల్వలలను పరిశీలించుకోవాలన్నారు. భారీ వర్షాలకు అధిక నీరు ప్రవాహంతో కల్వర్టులు, చెరువులు, కాల్వల గట్లు తెగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వలు, రహదారులు పొంగి పొర్లిపారే ప్రాంతాలను గుర్తించి మందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం పండించిన ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో వరి పంట కోత కోయరాదన్నారు. ముందుగా కోత కోసిన పంటను తక్షణమే సేకరించాలన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు పూచికత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు 1,500 టన్నుల ధాన్యం సేకరించాలన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. వర్షం అధికంగా కురిస్తే వరి పంటకు నష్టం జరగకుండా వాటిని దిగువ ప్రాంతాలకు వెళ్లే మార్గం చేయాలన్నారు. దిత్వా తుపాను ప్రభావం బాపట్ల జిల్లాపై కొంతమేర చూపనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. అద్దంకి, చిన్నగంజాం మండలాల్లో భారీ వర్షాలు



కురుస్తాయని, హైఅలర్ట్ వచ్చిందన్నారు. ఆ మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రికి వివరించారు. కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ పనిచేసేలా సిబ్బందిని నియమించామన్నారు. జిల్లాలో తుపానును ఎదురుకోవడానికి ముందస్తుగా చేసిన ఏర్పాట్లు, చర్యలపై మంత్రికి కలెక్టర్ నివేదిక అందజేశారు. ఇప్పటికే వరి కోత చేయరాదని అన్ని ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేసామన్నారు. ప్రకటన ముందుగానే ధాన్యం కోప జరిగితే, దాచి పెట్టడానికి 150 ప్రాంతాలలో గోదాములు సిద్ధం చేశామన్నారు. ఆ ప్రాంతాలు, సంబంధిత అధికారి ఫోన్ నెంబర్లతో సహా అన్ని రైతు సేవా కేంద్రాలకు సమాచారం పంపామన్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి పిలిపించామన్నారు. 47 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉండగా, 220 మెకానిసేడ్ బోట్లు, 400 మోటర్ రైజ్ బోట్లు ఉన్నాయని వాటిని సురక్షితంగా తీరంలో భద్రపరిచినట్లు వివరించారు. విద్యుత్ స్తంభాలు కూలడం వంటి తదితర సమస్యలు ఏర్పడితే తక్షణమే సహాయక చర్యల కొరకు 630 మంది వ్యక్తులను 42 బృందాలుగా ఏర్పరిచామన్నారు. రైతులకు నష్టం జరగకుండా విస్తృత ప్రచారం చేశామన్నారు. దిత్వా తుపానుతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైందని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ రావు తెలిపారు. ఐదు మండలాలపై తుపాను ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని నియమించామన్నారు. నిరంతరం వైర్లెస్ సెట్ తో పర్యవేక్షిస్తున్నామని మంత్రికి వివరించారు. సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులంతా తిరిగి వచ్చేసినట్లు సమాచారం అందిందన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ అనుసంధానంగా పనిచేస్తున్నామని తెలిపారు. వాగులు పొంగిపొర్లి పారే ప్రాంతాల వద్ద ప్రజలు వెళ్లకుండా పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థంగా నడుస్తున్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట చెప్పారు. బాపట్ల జిల్లాలో 167 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే 488 మంది రైతులకు స్లాట్ లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం 58 కేంద్రాలలో 2,922 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించామన్నారు. 598 వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మూడు వేల టార్పాలిన్ పట్టలు రైతు సేవా కేంద్రాలకు చేరాయని, మరో 1,100 టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేశామని, సోమవారం ఆయా ప్రాంతాలకు చేరుతాయన్నారు. 28 మిల్లులు బ్యాంకు పూచికత ఇవ్వగా ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా సాగుతుందన్నారు. 1.50 లక్షల గోనె సంచులు రైతు సేవా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పృథులగిరి లక్ష్మి నరసింహస్వామి దేవాలయం

### పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 30)

పృథులగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ మంజునాథ ఎసి ఫంక్షన్ హాలు నందు కన్వీనర్ యక్కలి శేషగిరిరావు అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. డిసెంబర్ 4వ తేదీన కరపత్రం ఆవిష్కరణ, డిసెంబర్ 6వ తేదీన స్థానిక పొదిలి వెంకటేశ్వరస్వామి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. డిసెంబర్ 8వ తేదీన పొదిలి మున్సిపల్ కమిషనర్ నుంచి రాష్ట్రపతి వరకు వినతి పత్రాలు పంపుట, డిసెంబర్ చివర్లో వేలాది మంది ప్రజలతో భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కెవి రమణారెడ్డి, ఉడుముల వరలక్ష్మమ్మ, సానికొమ్ము శ్రీనివాసులురెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, షేక్ నూర్జహాన్ బేగం, ముల్లా ఖాదర్‌భాషా, జి శ్రీనివాసులు, టిడిపి నాయకులు పొల్లా నరసింహయాదవ్, సిపిఐ నాయకులు కెవి రత్నం, బిజెపి నాయకురాలు బెల్లంకొండ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు సామి పద్మావతి, తూము బాలిరెడ్డి, రాంబాబు, భూమ సుమంత్, తదితరులు పాల్గొన్నారు.







# ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చాప చుట్టిన కూటమి ప్రభుత్వం

## సబ్సిడీ రుణాలకు బడ్జెట్ రిలీజ్ చేయాలి
## దళిత హక్కుల నేత నీలం నాగేంద్ర డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)
ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చాప చుట్టిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో నీలం నాగేంద్రరావు విలేకరులతో మాట్లాడారు. దళిత బహుజనుల ఐక్యతను విచ్ఛిన్నం చేయటమే కూటమి ప్రభుత్వ అజెండాగా కనిపిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఉన్న శ్రద్ధ కూటమి ప్రభుత్వానికి ఎస్సీల సంక్షేమంపై లేదన్నారు. ప్రమోషన్లలో కూడా వర్గీకరణ అమలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్న చంద్రబాబు అండ్ కో రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది ఎస్సీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఎస్సీలకు స్మశాన స్థలాలు కేటాయించడం లేదన్నారు. ఎస్సీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునే అర్జీదారుల వయస్సు కేవలం 50 సంవత్సరాలకే పరిమితం చేసిందన్నారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు, ప్రభుత్వం ఏర్పాటు చేశాక, పెన్షన్ ఊసే ఎత్తటం లేదన్నారు. మరోవైపు బీసీ రుణాలకు దరఖాస్తుదారుల వయోపరిమితి 55 సంవత్సరాల వరకు నిర్ణయించడం, ఎస్సీ బీసీల మధ్య ఈర్షను పెంచడమేనన్నారు. చంద్రన్న బీమా నిధులు ఆపేశారని, కులాంతర వివాహ ప్రోత్సాహ నిధులకు దిక్కు లేదని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పేరుతో ప్రపంచ బ్యాంకు నుండి నిధులు తెచ్చుకుంటున్న చంద్రబాబు ఎస్సీ ఎస్టీలకు కేంద్రం నుంచి రావలసిన ఎన్.ఎస్.ఎఫ్.డి.సి, ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి, నిధులు తెచ్చేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అమలు చేయడం లేదన్నారు. జిల్లాల్లో ఇంతవరకు జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. కమిటీలు ఏర్పాటు చేసిన ఒకటి రెండు జిల్లాల్లో, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కమిటీలో నియమించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో, శాఖల్లో కీలక పోస్టుల్లో మాల ఉద్యోగులకు, అధికారులకు ఉద్దేశపూర్వకంగా పోస్టులు నిరాకరించి తీవ్ర అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మాలల వ్యతిరేక ప్రభుత్వం మాత్రమే కాదని, మానవత్వం లేని ప్రభుత్వం అని నాగేంద్ర మండిపడ్డారు. రీ సర్వే పేరుతో అగ్రకులాలకు భూములను వెనక్కి ఇప్పిస్తున్న అగ్రకుల మనువాద ప్రభుత్వం, అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూములను, ఈనాం భూములను మాత్రం దళిత బహుజనులకు ఇప్పించడం లేదన్నారు. రీ సర్వే లో కూడా కుల వివక్ష చోటు చేసుకుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమపై చిత్తశుద్ధి ఉంటే, వెంటనే సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి, ఎస్సీ ఎస్టీ బీసీ సబ్ ప్లాన్ నిధులు మురిగిపోకుండా 2026 మార్చి లోపు సబ్సిడీ రుణాల కోసం షార్ట్ టైం యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చి, నిధులు ఖర్చు చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు.

## బీఎస్ఎన్ఎల్ నూతన ప్లాన్ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)
భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బి.యస్.యన్.యల్) డిసెంబర్ 1 నుండి డిసెంబర్ 31, 2025 వరకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌సీ1 ఫ్రీడం" మళ్లీ ప్రారంభించబడింది. కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ఈ ప్లాన్‌లో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జిబి డేటా, రోజుకు 100 మెసేజీలు , ఉచిత సిమ్ కార్డు అందించబడుతుందన్నారు. ఈ ఆఫర్ ఎం.యన్.పి. వినియోగదారులకు కూడా వర్తిస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కార్డు కావలసిన వారు తమ దగ్గరలోని బి.యస్.యన్.యల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఎమ్మెల్యే ఇంటూరికి ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అభినందనలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 30)
ప్రకాశం జిల్లాలో భాగమైన కందుకూరు నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం ప్రజల అభిలాషను, ఉద్యోగుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నెల్లూరు జిల్లాలోకి విలీనం చేయడం వల్ల అందరూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తూ కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపిన సందర్భంగా, ఈ నిర్ణయం సాధనలో కీలకపాత్ర పోషించి ప్రజల అభిలాషను బలంగా ప్రతిపాదించిన యువ నాయకుడు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్, కందుకూరు డివిజన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎస్. విజయభాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ మధుసూదన్ రావు, ట్రెజరర్ రమణయ్య, కార్యవర్గ సభ్యులు సాయి తేజ, శ్రీకాంత్, సింగయ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఏకాగ్రత పెంపునకు భరత నాట్యం మంచిది
### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 30)
విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉండటానికి ఏకాగ్రత్త సృజనాతకత ఆత్మ విశ్వాసం శారీరక దృఢత్వం పెంపోందించటానికి భరత నాట్యం మంచిదని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. ఆదివారం కనిగిరి పట్టణంలోని కూచిపూడి అన్నపూర్ణమ్మా నరసింహరావు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో భరత నాట్యం సంగీతం శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సాంప్రయాలకు పుట్టినిల్లు మన దేశమన్నారు. భరత నృత్యాన్ని నేర్చుకునే విధానం చాలా కఠినమైనది.దీనికి తగిన సమయం, శక్తి అవసరం. శాస్త్రీయ నృత్యం నేర్చుకోవడానికి ఆసక్తి మాత్రమే కాదు అంకితభావం చాలా ముఖ్యం, నృత్యం అనేది శారీరక,మానసిక ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. శాస్త్రీయ నృత్య రూప శైలి ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయన్నారు. భారతీయ శాస్త్రీయ నృత్యం మన విద్యా విధానంలో భాగంలో కావాలి. ఇది మన సంస్కృతికి సంబంధించిన శక్తిరూపమే కాదు అద్భుతమైన ధ్యాన సాధనం కూడా. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉండడానికి ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందించడానికి శాస్త్రీయ నృత్యం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాట్య గురువు లక్ష్మి శ్వేత, కౌన్సిలర్స్ తమ్మనేని సుజాత, దేవకి సత్యావతి, నాగూర్ బీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి
### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)
నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిత్వా తుఫాన్ సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లుపై మండలాల వారీగా, శాఖల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 మండలాల్లో 168 గ్రామాల్లో దిత్వా తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ముందస్తుగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్లరాదని ఆయన సూచించారు. నీటిపారుదల, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్తు, ఆర్‌అండ్‌బి, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్, శాఖలతో పాటు అన్ని డిపార్ట్మెంట్లు అప్రమత్తంగా ఉంటూ తగు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు అత్యవసరమైతేనే ప్రజలు బయటికి రావాలని, నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రజలకు సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ముఖ్యంగా తీర ప్రాంత మండల ప్రత్యేక అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ మండల పరిధిలోని అన్నీ శాఖల క్షేత్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా అన్నీ చెరువుల వద్ద క్షేత్ర స్థాయి సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## మర్రివేముల గ్రామంలో రైతన్న మీ కోసం





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, నవంబర్ 30)
మండలంలోని మర్రివేముల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆదివారం యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రతి రైతు ఇంటికి వెళ్లి పాంప్లేట్లు పంచి, రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లలచెరువు మండల అధ్యక్షులు పొట్ల గోవిందు, యర్రగొండపాలెం మండల అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, జనసేన అధ్యక్షులు కొఠారి అచ్చయ్య, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, పయ్యావుల ప్రసాదరావు, గజవల్లి భాస్కర్‌రావు, లక్ష్మణ్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషాభివృద్ధికి మండల వెంకటకృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయం
### సిబిఐ పూర్వజేడి లక్ష్మీనారాయణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)
తెలుగు భాషాభివృద్ధికి మండల వెంకటకృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయ మని సిబిఐ పూర్వజేడి లక్ష్మీనారాయణ అన్నారు. ఒంగోలులోని కళామిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా లక్ష్మీనారాయణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన సమయంలో వెంకట కృష్ణారావు చేసిన సేవలు ఉన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం విశేష కృషి చేసిన కృష్ణారావు మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించారని చెప్పారు. అటువంటి మహనీయుడు శతజయంతి ఉత్సవాలలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. మండలి వెంకటకృష్ణారావు జీవితాన్ని పాఠ్యాంశంలో చేర్చాల్సిన అవసరం ఉందని లక్ష్మీనారాయణ అన్నారు. తిరుమల కల్తీ నెయ్యి లిక్కర్ స్కాములపై లక్ష్మీనారాయణ స్పందిస్తూ వీటిపై షీట్ వేయడం జరిగిందని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్నారు. మండలి వెంకటకృష్ణారావు తనయుడు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ నేటి రాజకీయాలలో ధన ప్రభావం పెరిగిందన్నారు. ఒక సాధారణ ఉపాధ్యాయుడు కుమారుడుగా మండల వెంకటకృష్ణారావు పార్లమెంటులో అడుగు పెట్టారని, నేడు అటువంటి పరిస్థితులు లేవని అన్నారు. సామాన్యుడు చట్టసభలలో అడుగుపెట్టే రోజు రావాలని ఆ విధంగా ప్రజలలో చైతన్యం రావాలని ఆశిస్తూ మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మాతృభాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు.

# ఎం కరీముల్లా బేగ్‌కు సన్మానం




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 30)** కనిగిరి నియోజకవర్గం స్థాయి ఎన్ ఎం ఎమ్మెస్ నమూనా టాలెంట్ ప్రతిభ పరీక్షలకు పొదిలికి చెందిన హబీబుల్లా ఫౌండేషన్ ఛైర్మన్ ఎం కరీముల్లా బేగ్‌కి ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గంలోని విద్యాశాఖ అధికారులు, మార్కాపురం, కనిగిరి ఉప విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసులు, కనిగిరి నియోజకవర్గ హెడ్మాస్టర్‌లు పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు కరిముల్లా బేగ్ సేవలను కొనియాడారు.

# నగరంలో పర్యటించిన కమిషనర్ వెంకటేశ్వరరావు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)** దిత్వా తుఫాన్ ప్రభావంతో ఒంగోలు నగరంలో పర్యటించిన నగరపాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, పోతురాజు కాలువ, పాపా కాలనీ, తదితర కాలనీలో పర్యటించి వర్షపు నీరు నిలవకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో ఆత్మహత్య



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 30)** ఉలవపాడు గ్రామానికి చెందిన ఓగుబోయిన ప్రసాద్ రొయ్యల చెరువుల వద్ద పనిచేసే వేటపాలెం మండలం, జగన్నాథపురం గ్రామానికి చెందిన రాపూరి సాంబశివరావు తండ్రి జగన్నాథం అను అతను గత 17 సంవత్సరముల నుండి తన భార్య అయిన కోటేశ్వరమ్మను వదిలి పెట్టి వేరే ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్నారు. ఈ క్రమంలో తన కుటుంబ కలహాలు వలన మనస్థాపం చెంది చనిపోవాలనే ఉద్దేశంతో ఆదివారం ఉదయం సమయంలో తను పనిచేసే రొయ్యల చెరువుల వద్ద తాను ఉంటున్న రేకుల రూము ఇనుప కమ్మెకు ఉరివేసుకుని చనిపోయినట్లు అతని భార్య రాపూరి కోటేశ్వరమ్మ ఫిర్యాదు చేయగా సదరు ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ తెలిపారు.

# కందుకూరు మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం

**అసోసియేషన్ లోగో, ఆవిష్కరించి, ఐడీ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి**

**కందుకూరు పట్టణంలో స్ట్రీట్ బజార్ పెట్టి తక్కువ రెంట్లకు రూములు ఇచ్చే ఆలోచన ఉంది**

**సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కందుకూరులో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి**

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 30)** రాజస్థాన్ వాసి, రతన్ హృదయాన్ని తాకిన ఇంటూరి పాలనదక్షత. కందుకూరు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ బాధ్యులు, రాజస్థాన్ నివాసి, రతన్ సైతము ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి, పరవశం చెంది, ఇలాంటి ప్రజా రంజక నేతను నేనెప్పుడూ చూడలేదని, ఒకింత ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేయడం, కార్యక్రమంలో హైలైట్‌గా నిలిచింది. మీ పాలన అద్భుతంగా ఉందని, రతన్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి కృతజ్ఞతాపూర్వకంగా పాదాభివందనం చేశారు. రాజస్థానీ సాంప్రదాయ వస్త్రాలను ధరించి, కార్యక్రమానికి హాజరైన రతన్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కార్యదక్షతకు ముగ్ధుడై, ఎమ్మెల్యేని పొగడ్తల వర్షంలో ముంచెత్తారు. రాష్ట్రాల సరిహద్దులను దాటి ఎమ్మెల్యే ఇంటూరి ప్రజా




రంజక పాలన కొనసాగుతుందని, సభకు హాజరైన సెల్ ఫోన్ టెక్నీషియన్లు రతన్ వ్యాఖ్యలను విని చర్చించుకోవడం అక్కడ పరిపాటిగా మారింది. కందుకూరు పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం వెంగమాంబ ఫంక్షన్ హాల్ లో కందుకూరు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ లోగో, ఆవిష్కరణ, ఐడి, కార్డుల పంపిణీ కార్యక్రమం అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్ సలాం నేతృత్వంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మొబైల్ టెక్నీషియన్సు ఆమోదయోగ్యమైన ధరలతో, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. మొబైల్ రంగంలో నేడు విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఫోర్ జి నుంచి ఫైవ్ జి టెన్ జి వరకు మొబైల్ సేవలు విస్తృతం కానున్నాయన్నారు . నేటి ఆధునిక ప్రపంచంలో మొబైల్ రంగం పాత్ర కీలకమని ఆయన తెలిపారు. కందుకూరు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. కందుకూరులో రూముల అద్దెలు ఎక్కువగా ఉన్నాయని, నెల్లూరు తరహాలో స్ట్రీట్ బజార్ పెట్టి తక్కువ కిరాయికి రూములు అందించే ఆలోచన తనకుందని తెలిపారు. తనను తమ స్వంత సోదరునిగా భావించి గెలిపించిన కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవని, ఎవరికి ఇబ్బంది కలిగించే ధోరణి తనది కాదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. పట్టణంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు గవివరించారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో తాను అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. మొబైల్ టెక్నీషియన్లు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అసోసియేషన్, పార్టీలకు అతీతంగా పనిచేయాలని, అసోసియేషన్‌లో ఉన్న బాధ్యులు బిపిఎల్ కు దిగువన ఉన్నట్లయితే వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శివ నాగరాజు మాట్లాడుతూ మొబైల్ టెక్నీషియన్లు వినియోగదారుల పట్ల మంచి స్నేహ పూర్వక వాతావరణంలో, సేవాభావంతో, వ్యవహరించాలన్నారు. తమ దుకాణాలు ముందు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కందుకూరు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్ సలాం మాట్లాడుతూ కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడానికి నిరంతరం కృషి చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎంటిఏ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఎంటిఎ కందుకూరు అధ్యక్షులు రియాజ్, సెల్ వరల్డ్ బాధ్యులు శ్రీకాంత్, పలువురు మొబైల్ టెక్నీషియన్లు, తదితరులు పాల్గొని ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆయన పై అభిమానంతో పూల వర్షం కురిపించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మొబైల్ టెక్నీషియన్లకు ఐడి కార్డులను, టీ షర్టులను పంపిణీ చేశారు.




# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 30)** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ సూచనల మేరకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఉలవపాడు మండల వైస్సార్సీపీ ఆధ్వర్యంలో బద్దిపూడి గ్రామ పంచాయతీ నందు కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, స్థానిక గ్రామ పంచాయతీ పార్టీ అధ్యక్షులు చేజర్ల సుబ్బరామిరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, సీహెచ్ సుబ్బరామిరెడ్డి, సీహెచ్ యలమందారేడ్డి, సీహెచ్ దశరదరామిరెడ్డి, సీహెచ్ వెంకట సుబ్బారెడ్డి, సీహెచ్ గోపాల్‌రెడ్డి, ఎం పరమశ్వేరరెడ్డి, కె వెంకట్రామిరెడ్డి, టి కృష్ణారెడ్డి, సీహెచ్ విజయ్‌రెడ్డి, సీహెచ్ కౌశిక్, సీహెచ్ వికాస్, జిల్లా బీసీ నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఫజిల్, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు పాలవెల్లి అమర్నాథ్‌రెడ్డి, మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ దస్తగిరి సాహెబ్, మండల స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు చీరె రమణారెడ్డి, మండల నాయుకులు మానం సుబ్బారావు, సన్నెభోయిన సుధాకర్, వాకా సురేంద్రరెడ్డి, ఆలూరి ఏసుబాబు, ఆలూరు మోషే, మండల సోషల్ మీడియా కన్వీనర్ ఆలూరి మధు, ఇతర పార్టీ నాయకులు, అభిమానులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేశారు.

# సనాతన ధర్మంలోని గొప్పదనాన్ని తెలియచెప్పాలి

**చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య**

**సెల్ ఫోన్, టీవీలను అతిగా చూడడం అనర్థదాయకమని స్పష్టీకరణ**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)** విద్యార్థులకు సనాతన ధర్మంలోని గొప్పదనాన్ని తెలియ చెప్పాలని వారు ధార్మిక మార్గంలో నడిచేలా చూడాలని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న బాల విహార్ శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు సెల్ ఫోన్ టీవీలను ఎక్కువ సమయం చూడడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని జ్ఞాపకశక్తి కూడా దెబ్బతింటుందని ఆయన వివరించారు. రోజులో కొంత సమయాన్ని మాత్రమే టీవీ సెల్ ఫోన్ లను ఉపయోగించేందుకు, తల్లిదండ్రులు పిల్లలను అనుమతించాలని పవిత్ర చైతన్య సూచించారు. బాల విహార్ శిక్షణా తరగతుల వల్ల విద్యార్థులలో బహుముఖ సంస్కారాలు నైపుణ్యాలు మరింత వృద్ధి చెందుతాయని వెల్లడించారు. ప్రతి ఆదివారం క్రొత్త విషయాలను విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులలో నిబిడీకృతమై ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీసే విధంగా శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వాహకులు, చిన్మయ మిషన్ ప్రతినిధులు చేస్తున్న కృషిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవనంలో జరిగిన శిక్షణ తరగతులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు, చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పర్యవేక్షించారు.

# ఘనంగా కళామిత్ర మండలి 19వ వార్షికోత్సవ వేడుకలు

## దివి సీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**

కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ 19వ వార్షికోత్సవ వేడుకలు, స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను ఆదివారం ఒంగోలులోని యన్‌టిఆర్ కళాక్షేత్రం నందు ఘనంగా నిర్వహించారు. సభకు సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించగా, అవార్డ్స్ కమిటీ ఛైర్‌పర్సన్ తేళ్ళ అరుణ నిర్వహణలో ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలతో అలంకరించి, అనంతరం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు మరియు శ్రీమతి నూనె వెంకాయమ్మ- వెంకటరత్నం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పిదప సంస్థ ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి కళామిత్ర మండలి కార్యక్రమాల నివేదికను తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రసంగిస్తూ మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాష కోసం, దివిసీమ కోసం చేసిన సేవలను గుర్తు చేశారు. మరొక ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు హాజరై నిరంతరం తెలుగు భాష కోసం కృషి చేస్తున్న సంస్థ నిర్వాహకులను , మండలి వెంకట కృష్ణారావు పేరిట బుద్ధప్రసాద్ చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ, వారి తండ్రి ప్రజలకు చేసిన నిరూపమాన సేవలను కొనియాడారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నేడు మన సంస్కృతీ, సంప్రదాయాలతోపాటు మన మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని,అది అందరి బాధ్యత అని , సమాజానికి తమ తండ్రి చేసిన పలు సేవలను గురించి ప్రస్తావించారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన గురించి జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతు జన బాంధవుడు, దివిసీమ పునర్నిర్మాత, తెలుగు భాషాభివృద్ధికి తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరిని ఒకే వేదిక పైకి చేర్చి, తెలుగు భాష ఔన్నత్యం ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు కృష్ణారావు అని తెలిపారు. 1977 నవంబర్ 19న సంభవించిన దివిసీమ ఉప్పెనకు సముద్ర తీర గ్రామాలు కకావికలమై శవాల దిబ్బగా మారిపోగా, కృష్ణారావు నిద్రాహారాలు మాని దేశ విదేశాల నుంచి స్వచ్ఛంద సంస్థల సహాయాన్ని దివిసీమకు అందించి అచిరకాలంలోనే మరు భూమిగా ఉన్న ప్రాంతాన్ని దివ్య సీమగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అనంతరం నిర్వాహకులు జేడీ లక్ష్మీనారాయణకు అతిథులందరి చేతుల మీదుగా"శ్రీమతి నూనె వెంకాయమ్మ - వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రధానం చేశారు. అలాగే మరో తొమ్మిది మందికి కూడా జాతీయ స్థాయి పురస్కారాలను అందజేశారు. పురస్కారాలను అందుకున్న వారు వరుసగా డాక్టర్ నాగభైరవ, డాక్టర్ మండవ నరసింహారావు స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు చిలకలూరిపేట, కొంపల్లి బాలకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం బండ్ల మాధవరావు, విజయవాడ, శ్రీమతి భూసురపల్లి సుబ్బరత్నం - ఆదిశేషయ్య స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం డాక్టర్ ఇరపని మాధవి, గుంటూరు , కరణం జ్ఞానేశ్వరి స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" పాతూరి అన్నపూర్ణ, నెల్లూరు, శ్రీమతి సీతాదేవి- నాగేశ్వరరావు స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం డాక్టర్ యం.హరికిషన్, కర్నూలు, డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం"పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి, "శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, హైదరాబాద్, శ్రేష్ఠశ్రీ నన్నపనేని మాధవీలత స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" డాక్టర్ డి ధాత్రికుమారి, గుంటూరు, "మేకల జయరామిరెడ్డి స్మారక క్రీడారత్న ప్రతిభా పురస్కారం" డాక్టర్ బాచిన చెంచు గరటయ్యలకు ప్రధానం చేశారు. వీరితోపాటు ప్రముఖ కవి యు.వి.రత్నం, రంగస్థల నటులు పాలేటి బాబూరావు, నృత్య ప్రదర్శన చిన్నారులు టంగుటూరి సాయి ప్రజ్ఞ, నిడమానూరి ఝాన్సీలకు కళామిత్ర ప్రతిభా పురస్కారాలను అందించి, కళామిత్ర మండలి సంస్థ కోసం కృషి చేస్తున్న గుంటూరు సత్యనారాయణ, డాక్టర్ చౌడం గురుప్రసాద్ (కడప), కప్పగంతు జయరామయ్య, మిడసల మల్లికార్జునరావు తదితరులను కళామిత్ర పక్షాన ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సభలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఛైర్మన్ మండవ మురళీకృష్ణ, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి వి పూర్ణచందు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆది నారాయణ, ప్రముఖ సాహితీవేత్త, కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, నారాయణ విద్యా సోసైటీ వ్యవస్థాపకులు కొల్లా నారాయణరావు, తదితరులు మండలి వారు చేసిన సేవలను కీర్తించారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న గౌతం మోడల్ విద్యా సంస్థల చైర్మన్ యం కొండయ్య, కుర్రా ప్రసాద్ బాబు, ముట్లూరి వెంకయ్య, ఓరుగంటి ప్రసాద్, పాపిశెట్టి శశికుమార్‌లు సంస్థ తెలుగు భాషకు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పురస్కార ప్రదాతలు నన్నపనేని రవి, కరణం విమల, యం సీతారామిరెడ్డి, వి ఝాన్సీదుర్గ, కొలకలూరి విద్యాధర్ చక్రవర్తి , వంకాయలపాటి బిందు పాల్గొన్నారు. సభకు ముందు నూకతోటి శరత్ బాబు, డాక్టర్ మున్నంగి రాజకుమారి తమ గీతాలతో సభను ఆకట్టుకున్నారు. చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల చేసిన దేశభక్తి, జానపద నృత్యాలు సభికులను ఎంత గానో అలరించాయి. పురస్కారాల సభ తర్వాత మండలి వెంకట కృష్ణారావు పేరిట జరిగిన స్మారక కవి సమ్మేళనానికి సంచాలకులుగా యం సూర్యకుమారి, డివియం సత్యనారాయణ, గాడేపల్లి దివాకర్ దత్తు, కేయస్వీ ప్రసాద్, ఇనకొల్లు మస్తానయ్యలు వ్యవహరించారు. సభ అనంతరం నిర్వాహకులు అతిథులను కవి సమ్మేళనంలో పాల్గొన్న 60 మంది కవులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని బీరం అరుణ, కె బాలకోటయ్య, జి వి శేషగిరిరావు, దొద్దాల శ్రీనివాసరావులు, పి గోవర్ధన్‌రెడ్డి, రంగుల సంధ్య, వాసులు, నాళం నరసమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

# ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 30)**

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గం వైఎస్‌ఆర్ సీపీ ఇన్‌ఛార్జి అన్న వెంకట రాంబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషీర్ అలీ బేగ్‌తో కలిసి పట్టణ అధ్యక్షులు సలీం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం రచ్చబండలో భాగంగా కోటి సంతకాల సేకరణ జరిగింది. అనంతరం అన్నా రాంబాబు మాట్లాడుతూ ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల పేదలకు వైద్య దూరం అవుతుందన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి ప్రైవేటు కాలేజీల్లో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీని పై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సలీం, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నాలి కొండయ్య యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ గుంటక వనజాక్షి, రాష్ట్ర యూత్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, పిఎల్‌పి యాదవ్, పట్టణ యూత్ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## నేడు పెన్షన్‌ల పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 30)**

డిశంబర్ 1వ తేదీ సోమవారం ఉలవపాడు గ్రామపంచాయతీ ఏరియాలోని కొత్తూరు, పాత మసీద్ ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై ఆయన చేతుల మీదుగా పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పామూరు రోడ్డు జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ప్రజలు, కూటమి పార్టీ నేతలు, కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు కోరారు.

## మార్కాపురంలో ఎంవీఐ తనిఖీలు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 30)**

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాధవరావు ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పన్ను చెల్లించకుండా తిరుగుతున్న ఒక మినీ బస్, ఎఫ్‌సీలు లేకుండా తిరుగు తున్న మరో రెండు వాహనాల పై కేసులు నమోదు చేసి చలా నాల విధించారు. తనిఖీలలో 3 కేసులు నమోదు చేయబడ్డాయి. పన్ను చెల్లించకుండా 1, ఏపీ 27యుబీ1069, రూ.98, 365 సీఎఫ్ వసూలు చేయబడింది. ఎఫ్‌సీ లేకుండా 2 కేసులు సేల్ చేసిన వాహనాలను రవాణా కార్యాలయానికి తరలించారు.

## దిత్వ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎలాంటి ప్రమాదాలకు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

**ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**

దిత్వ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు సూచించారు. ఆధివారం ఆయన అధికారులతో తుఫాను నేపథ్యంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తాయన్న తుఫాన్ వాతావరణ కేంద్ర హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలని కోరారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళరాదన్నారు. ప్రజలు విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా పిల్లలను, పశువుల కాపరులు, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ తీగల వద్ద ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా ఒంగోలు నగరంలో పోతురాజు కాలవ వెంబటి నివసించే ప్రజలు అప్రమత్తంగా వుండాలని, ఏ సమస్య వచ్చిన పార్టీ కార్యాలయంలో ప్రతినిధులు గాని లేక మున్సిపల్ అధికారులను సంప్రదించాలని ప్రజలకు తెలియజేసారు. మున్సిపల్ కార్యాలయాలలో ఎమర్జెన్సీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఏదైనా సహాయం కావాలంటే మున్సిపల్ కార్యాలయాలలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటారన్నారు. మీకు ఎటువంటి సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి కూడా తీసుకురావాలని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎమర్జెన్సీ కాల్ సెంటర్ నెంబర్ 08592 -227766ను సంప్రదించాలన్నారు.

# మండువవారిపాలెంలో రైతు సేవా కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**

మండువవారిపాలెం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాల నూతన భవనాలను ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రారంభించారు. మండలంలోని మండువవారిపాలెం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాల నూతన భవనాలను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ప్రారంభించారు. రూ.43.60 లక్షలతో సచివాలయంను, రూ.23.94 లక్షలతో రైతు సేవా కేంద్రం భవనాలను నిర్మించారు. రెండు భవనాలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ మండువవారిపాలెం గ్రామంలో డ్రైనేజీ, నీటి, రోడ్ల సమస్యలు ఎక్కువగా ఉందన్నారు. ఆ సమస్యను కూడా త్వరలోనే పరిష్కారం చేస్తామన్నారు. గ్రామంలో సర్వే నంబర్లు ఇబ్బంది ఉందని దాన్ని కూడా పరిష్కారం చేస్తామని అన్నారు. ఈ గ్రామంలో మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. 20 సంవత్సరాలు, 30 సంవత్సరాలు ముందు కొన్ని రోజులు డ్యామేజ్ అయిన ఆ రోడ్లు కూడా తప్పకుండా పూర్తి చేస్తాం. తెలుగుదేశం ప్రభుత్వ అంటేనే అభివృద్ధి ప్రభుత్వమన్నారు. ఎన్డీఏ కుటమి వచ్చిన తర్వాత అన్నీ కార్యక్రమాలు ఎంత ఆర్ధిక ఇబ్బందులు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఈ రోజు ఎన్డీఏ కుటమిలో మోడీ సహకారంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్లడానికి అదే విధంగా 2014-2019 లో కూడా ఎన్నో కార్యక్రమాలు కూడా ఈ నియోజకవర్గంలో మనం చేశామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధికారి ఎం వెంకటేశ్వరరావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, కామేపల్లి శ్రీనివాసరావు, మండవవారిపాలెం సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య, పెంట్యాల సుబ్బారావు, కారుమూడి గోపీనాథ్, మారెళ్ళ శ్రీధర్ బాబు, మారెళ్ళ రాజేంద్రప్రసాద్, ముప్పనేని హరిబాబు, నల్లమోతు రాంబాబు, మానేపల్లి వెంకటేశ్వరరావు, కోల వెంకట శేసు కుమార్, మాలే గంగిరెడ్డి, కొత్తూరు రాజా, షేక్ హుస్సేన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో ఎస్టీయు కార్యవర్గ సమావేశం

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 30)**










మార్కాపూ కోర్టు సెంటర్‌లోని సిపిఐ ఆఫీస్ నందు ఎస్టీయు కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎర్రయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండలం ఎస్టీయు నూతన అధ్యక్షులుగా కశ్శెట్టి జగన్ బాబును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే ప్రధాన కార్యదర్శిగా షేక్ నజీర్ అహ్మద్,కోశాధికారిగా సాధు అంజనీ కుమార్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాగుటూరి ఎర్రయ్య మాట్లాడుతూ తర్లుపాడు మండల ఎస్టీ అధ్యక్షులుగా ఉన్న కశ్శెట్టి జగన్ ఎస్టీయు టీం మండల ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారికి కావలసిన సేవలు నిరంతరం అందిస్తూ వారి అభిమానాన్ని చూరగొన్నారు. అంతేగాక మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూనియన్ తరపున ఉచిత మెటీరియల్ అందించడం, అలాగే తన సొంత నిధులతో ఎగ్జామ్ పాడ్స్ అందించడం. ఎస్సీ, బీసీ హాస్టల్ కు మౌలిక సదుపాయాలు అనగా దోమతెరలు, కరెంటు సామాగ్రి అందించడం జరిగింది. అలాగే యూనియన్ తరపున మండలం లెవల్లో శతకబాల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించడం జరిగింది. అలాగే నూతన డీఎస్సీలో మండలంలో జాయిన్ అయిన ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. అంతేకాకుండా మార్కాపురం డివిజన్ లెవల్ లో నూతన సభ్యత్వాలను నమోదు చేయడంలో తర్లుపాడు మండల యూనిట్ ప్రథమ స్థానంలో ఉందని తెలియజేశారు. ఈ విధంగా సేవలందిస్తున్న జగన్, నజీర్ అహ్మద్ అంజనీ కుమారులను అభినందిస్తూ మరొకమారి ఏకగ్రీవంగా సభ్యులందరూ ఎన్నుకోవడం జరిగింది. తదుపరి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టియు ప్రకాశం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బి.సీహెచ్ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఎన్నికల పరిశీలకులు షేక్ యూసఫ్ షరీఫ్, ఎన్నికల అధికారి టి వి రమణ, మార్కాపురం మండలం అధ్యక్షులు అక్కల నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ గాలెయ్య, సూరె జ్యోతి, సంజీవ్ కుమార్, కమిటీ సభ్యులు రాజా రమేష్, రవి, హనుమంతరావు, ఆదినారాయణ, రంగస్వామిరెడ్డి, బి ఎర్రయ్య, శ్రీరామ్ శెట్టి, కాశయ్య, నాగయ్య, రంగ ప్రదీప్, విఠల్ కుమార్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దిత్వా తుఫాన్ నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి ఆదేశాలు



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, నవంబర్ 30)**

దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీలలో గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు సూచించారు. తుఫాన్ ప్రభావం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అద్దంకి నియోజకవర్గంపై దిత్వా తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలి,ప్రజలు విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలన్నారు. మత్స్యకారులు నదులలో చేపల వేటకు వెళ్లరాదని నదీ పరివాహక గ్రామాల్లో పోలీస్, రెవెన్యూ, మత్స్యశాఖల అధికారులు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా జిల్లాలోని వాగులు, నదీ ప్రాంతాలు, ప్రమాదకర పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు జారీ చేశారు.

# నేడు ప్రజా సమస్యల పిజిఆర్ఎస్ రద్దు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 30)**

డిశంబర్ 1వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్‌ను రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 29 నుండి డిశంబర్ 1వ తేదీ వరకు జిల్లాలో దిత్వా తుఫాన్ వల్ల భారీగా గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిస్కార వేదికను (పి జిఆర్ఎస్) రద్దు చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలు ఎవరు కూడా సోమవారం జిల్లా కేంద్రానికి సమస్యల అర్జీలను అందజేయుటకు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# బ్రహ్మంగారి మఠం వాసికి డాక్టరేట్ ప్రధానం

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, నవంబర్ 30)**



బ్రహ్మంగారి మఠం మండలం నరసన్న పల్లె గ్రామానికి చెందిన చెన్నా సుమలత గౌరవ డాక్టరేట్ పొందినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె కర్నూల్‌లోని ఓ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తోంది. సుమలత విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భౌతిక శాస్త్ర విభాగం నందు ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది చేంజ్ ఇన్ స్ట్రక్చరల్ బ్యూమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ డైస్ప్రోజియం టెర్బిజియం అయాన్స్ డోప్డ్ జింక్ బిస్మత్ బేరియం బోరో ఫ్లోరో టెల్యూ రైట్ గ్లాస్సెస్ ఫర్ లేజర్ అప్లికేషన్స్. అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను విశ్వవిద్యాలయం వారు సుమలతకు డాక్టరేట్ ప్రధానం చేసి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ తన పరిశోధనకు సహకరించిన ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో మరిన్ని అంశాలపై తాను పరిశోధనలు చేసి తన తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్











**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 30)**
దిత్వా తుపాను హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలకు ముంపునకు గురయ్యే గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి మండలం, కొరిశపాడు మండలాలలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల రెవిన్యూ గ్రామం పరిధిలోని తిమ్మనపాలెం గ్రామ చెరువును ఆయన పరిశీలించారు. 95% నిండుగా చెరువు ఉండడంతో భారీ వర్షాలకు చెరువు కట్ట తెగకుండా ముందస్తుగా బలోపేతం చేయాలన్నారు. చెరువు లోపలకు నీటి ప్రవాహం వచ్చే మార్గంలో పూడికతీత యుద్ధ ప్రాతిపదికను తొలగించాలన్నారు. వర్షాలకు చెరువు నిండితే వెలుపలకు వెళ్లే మార్గం సరి చేయాలన్నారు. జాతీయ రహదారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు ప్రాంతమైన అద్దంకి మండలం దేనువకొండ గ్రామాన్ని కలెక్టర్ పరిశీలించారు. అద్దంకి మండలం గాజులపాలెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. విపత్తు నిర్వహణ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాలువలో పూడికతీత, గుర్రపు డెక్క తొలగించడానికి జెసిబి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జనరేటర్లు, చెట్లు తొలగించడానికి తదితరమైన యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. అధిక వర్షపాతం నమోదైతే దేనువకొండ గ్రామంలో కొన్ని గృహాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వారిని యుద్ధ ప్రాతిపదికన తరలించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే దేనువకొండలో గుర్తించిన ప్రాథమిక పాఠశాల పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పునరావాస కేంద్రంలో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే విద్యుత్ దీపాలు, నీటి వసతి తదితరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలపై ఆరా తీశారు. ఏయే ప్రాంతాలలో వరద నీరు వస్తుందని అంశాలపై సంబంధిత శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత తుపాను సమయంలో గుండ్లకమ్మ నదికి 90 క్యూసెక్కుల నీరు వచ్చిందని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే చిలకలేరు, దోర్నపువాగులు పొంగి పొర్లిపారే అవకాశం ఉందని, ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. చెరువుకొమ్మపాలెం చప్టా వద్ద వర్షపు నీరు అధికంగా వచ్చే అవకాశం ఉందని, సమీప ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అద్దంకి పట్టణంలో నీరు నిలిచే కాలనీలలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలను ఆయా చెరువులు, కాల్వల చప్టాలు, గట్ల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. చెరువు కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, సమీపంలోని ప్రజలను చైతన్యపరిచడం, అప్రమత్తంగా ఉంచాలని ఆయన సూచించారు. అనంతరం ముంపునకు గురయ్యే బాధిత కుటుంబాలకు పునరావాస కాలనీలో నివాస స్థలాలు ఇవ్వాలి, మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్ కు విన్నవించారు. ఆయన వెంట చీరాల ఆర్డిఓ టి చంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్, తహసిల్దార్ చరణ్, జల వనరుల శాఖ ఇంజనీర్లు, తదితరులు ఉన్నారు.



# మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దు









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**
దిత్వ తుఫాను నేపథ్యంలో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, కొత్తపట్నం తీరంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళవద్దని అధికారులు తెలిపారు. సముద్రంలోని అలలు పెద్ద ఎత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రానికి ప్రజలు రావద్దని అధికారులు తెలిపారు. మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. కొత్తపట్నం తీరం వెంబడి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాలతో సముద్రం దగ్గరకి ప్రజలు ఎవరూ రాకుండా ఎప్పటికప్పుడు సముద్ర పరిస్థితిని సిబ్బందితో కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ పర్యవేక్షిస్తున్నారు.

# "మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను" వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 30)**
"మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను" వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఆనారోగ్యంతో బాధపడే వారికి ఆపన్న హస్తం

## ముఖ్యమంత్రి సహాయనిధి

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి





**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 30)**
నియోజకవర్గంలోని 63 మందికి రూ.43,80,714లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న 63 మందికి 11వ విడతగా మంజూరైన రూ.43,80,714ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఆపన్న హస్తం అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చునన్నారు. వారికి అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చునన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేక మంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 710 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.6.28 కోట్లు అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ నందు ఐవిఎఫ్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ప్రారంభం

## ప్రారంభించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 30)**
వైద్య సేవలు అతి తక్కువ ఉన్న మాచర్ల పట్టణంలో రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ స్థాపించి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తూ ప్రజలలో మంచి పేరు గడిస్తూ ఆదివారం నూతనంగా రవితేజ హాస్పిటల్ నందు మొట్ట మొదటిసారిగా కిరణ్ ఐవైఎఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలోనే మొట్ట మొదటిసారిగా టెస్ట్ ట్యూబ్ బేబీ నూతన కేంద్రాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వివాహం జరిగి సంతానం కలగని దంపతులు ఎక్కడికో హైదరాబాద్,చెన్నై, బెంగళూరు వంటి మహా నగరాలకు వెళ్లి లక్షలు ఫీజులు చెల్లించి వైద్యం చేసుకునేవారు అని కానీ ఇప్పుడు అత్యాధునిక వైద్య సేవలతో రవితేజ హాస్పిటల్ నందు టెస్ట్ ట్యూబ్ బేబీ కేంద్రం ప్రారంభించటం నాకెంతో సంతోషకరమైన విషయం అని వెల్లడించారు. సంతానం లేని దంపతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని సంతాన ప్రాప్తి పొందాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పల్నాడు ప్రాంత ప్రజలని కోరడం జరిగింది. ఐవిఎఫ్ డాక్టర్ గోనుగుంట్ల సుష్మ మాట్లాడుతూ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ప్రారంభించిన రోజే దాదాపు సంతానం లేని 54 జంటలు రవితేజ హాస్పిటల్‌కి రావడం జరిగిందని వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి జంటలకు తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని డాక్టర్ సుష్మా వెల్లడించారు.మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున్ రావు నూతన టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొని రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ శ్రీకాంత్ సుష్మ మాచర్ల పట్టణంలో స్థాపించటం ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాల నూతన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని, సంతానం లేని దంపతులకు టెస్ట్ ట్యూబ్ బేబీ మరియు ఐవీఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం ఆనందదాయకమని పత్రిక మిత్రులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్ పర్సన్ మదర్ సాహెబ్ , మాచర్ల పట్టణ అధ్యక్షులు కొమెరా దుర్గారావు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మద్దిగడపు పెద్ద వెంకటరామిరెడ్డి, మద్దిగడుపు చిన్న వెంకటరామిరెడ్డి, రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోలూరి నరసింహారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యనమల కేశవరెడ్డి, మూడవత్ వజ్రం నాయక్, బిజెపి అధ్యక్షులు ఓర్సు క్రాంతి కుమార్, పట్టణ జనసేన అధ్యక్షులు లాల్ కృష్ణ గౌడ్, మాచర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శీను, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిక్క కొండలు, కౌన్సిలర్లు దస్తగిరి కోటిరెడ్డి, చందు గౌడ్ , పల్నాడు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు పిన్నంశెట్టి కృష్ణ, మాచర్ల పట్టణ డాక్టర్స్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

